సమస్యలతో బస్తీ ప్రజల ఇక్కట్లు

- కొత్త రోడ్డు వేసేందుకు ఏడాది క్రితం రోడ్డును తవ్వించిన కాంట్రాక్టర్
- ఇప్పటికీ ప్రారంభంకాని పనులు
- వెలగని వీధిలైట్లు, పొంగుతున్న డ్రైనేజీలు
- ఫిర్యాదులకు స్పందించని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహాభారత్‌నగర్ బస్తీ ప్రజలు

ఖైరతాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ మహాభారత్ నగర్‌లో ఎన్నో ఏళ్లుగా సమస్యలు తిష్టవేశాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజాప్రతినిధులకు తమ బస్తీ గుర్తుకొస్తుందని, ఆ తర్వాత పట్టించుకోరని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్డు వేసేందుకు పాత రోడ్డును తవ్వి సంవత్సరం దాటినా పట్టించుకోకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడాది దాటినా ప్రారంభంకాని పనులు

మహాభారత్‌నగర్ కమ్యూనిటీహాల్ నుంచి బస్తీ దవాఖానా వరకు సీసీ రోడ్డు పనుల కోసం నిధులు మంజూరు కావడంతో కాంట్రాక్టర్ పాత రోడ్డును తవ్వించాడు. దీంతో వర్షం వస్తే ఇక్కడి బస్తీల్లోని వీధుల్లో నీరు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ రోడ్డుకు 50 మీటర్ల దూరంలో ఉన్న బస్తీ దవాఖానా వద్ద ఉన్న వర్షపు నీటి పైప్‌లైన్‌కు కచ్చామోరీల ద్వారా పైప్‌లైన్ వేయాలని స్థానికులు కోరారు. దీంతో పాటు తరచూ డ్రైనేజీలు పొంగుతుండటంతో సీవరేజ్ పైప్‌లైన్ వేసి రోడ్డు నిర్మిస్తే సమస్యలు లేకుండా ఉంటాయని స్థానికులు కోరడంతో సీసీ రోడ్డు పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. అయితే కచ్చామోరీ పైప్‌లైన్‌తో పాటు సీవరేజ్ పైప్‌లైన్ల కోసం ప్రతిపాదనలు పంపించి సంవత్సరం దాటినా ఎలాంటి స్పందన లేకపోవడంతో స్థానికులు పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసినా ప్రయోజనం లేకపోయింది. ప్రస్తుతం బస్తీలోని మహాకాళి దేవాలయం వద్ద డ్రైనేజీలు పొంగుతూ ఆలయంలోకి వెళ్లే మార్గంలో మురుగు నిలుస్తోంది. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. కాగా, కొత్త సీవరేజ్ పైప్‌లైన్ విషయమై సంబంధిత మేనేజర్‌ను విచారిస్తే ఇక్కడ సీవరేజ్ పైప్‌లైన్ వేయాల్సిన అవసరం లేదని.. ఎలాంటి ప్రతిపాదనలు తాము పంపలేదని జీహెచ్ఎంసీకి ఈ విషయం తెలియజేశామన్నారు.

ఖైరతాబాద్ వాసులకు ప్రత్యామ్నాయ మార్గం..

ప్రస్తుతం భారీ గణపతి చౌరస్తా నుంచి మింట్ కాంపౌండ్ వెళ్లే మార్గంలో ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్‌లో ముంపు సమస్య పరిష్కారం కోసం పనులు జరుగుతున్నాయి. ఇందుకోసం 2 నెలల నుంచి రోడ్డును మూసివేశారు. దీంతో ఖైరతాబాద్ వాసులు ప్రత్యామ్నాయ రహదారిగా ఇక్కడి రోడ్డు నుంచి ఐమాక్స్ రహదారికి వెళ్తున్నారు. ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్న ఈ రోడ్డు సరిగ్గా లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


ప్రస్తుతం రోడ్డు పరిస్థితి


సంవత్సరం క్రితం సీసీ రోడ్డు నిర్మాణం కోసం తవ్వుతున్న దృశ్యం (ఫైల్)

వీధిలైట్లు వెలగక ఇబ్బందులు..

ఈ బస్తీలో వీధి దీపాలు సరిగ్గా వెలగడం లేదని ఎన్నోసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. రాత్రి సమయాల్లో పోకిరీలు రోడ్లపై ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో కూర్చొని మద్యం తాగుతూ ప్రజలను వేధిస్తున్నారనే ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. మరోవైపు జలమండలి సిబ్బంది ఈ బస్తీలో ఉదయం 5 గంటల సమయంలో తాగునీరు వదులుతుండటంతో చీకటిగా ఉన్న వీధుల్లో నల్లాలకు మోటార్లు బిగించాలంటే ఇబ్బందిగా ఉంటుందంటున్నారు. మోటారు బిగించబోయి కరెంట్ షాక్‌తో ఓ యువతి గాయాలపాలైనా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకుని సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డును తవ్వి సంవత్సరం దాటింది



రోడ్డును తవ్వి సంవత్సరం దాటినా పనులు చేయడం లేదు. సీవరేజ్ పైప్‌లైన్‌తో పాటు కచ్చామోరీలకు పైప్‌లైన్లు వేస్తామని చెప్పినా ఆ పనులు జరగడంలేదు. రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగించే రోడ్డు ఇలా ఉండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మహాకాళి అమ్మవారి ఆలయం వద్ద డ్రైనేజీలు పొంగుతుండటంతో ఆలయంలోకి వెళ్లలేకపోతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి.

\- ఫకీరయ్య యాదవ్, మహాభారత్ నగర్ అధ్యక్షుడు

జలమండలి అధికారుల వల్లే జాప్యం

ఇక్కడ సీవరేజ్ పైప్‌లైన్ వేసేందుకు ప్రతిపాదనలు పంపి పనులు చేయించాలని సంబంధిత అధికారులకు చెప్పాం. ఇప్పుడు వారు మాట మార్చుతూ సీవరేజ్ పైప్‌లైన్ అవసరం లేదనడం సరికాదు. అక్కడ కచ్చామోరీ పైప్‌లైన్లు వేయకుండా రోడ్డును ప్రస్తుతం లేక్‌వ్యూ పార్కువైపు ఉన్న కచ్చామోరీ వైపు స్లోప్ చేయాలనుకున్నాం.

\- చరణ్, ఏఈ, జీహెచ్ఎంసీ


జలమండలి జీఎం హరిశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

యూసుఫ్‌గూడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ ప్రజలు ఇప్పుడే నీటి సమస్యలు ఎదుర్కొంటున్నారని, వేసవిలో సమస్య మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉండటంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి జలమండలి జీఎం హరిశంకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. డ్రైనేజీ సమస్య సైతం అధికంగా ఉందని, పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎం వాహబ్, మేనేజర్ సూర్యప్రకాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


సునీతను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

సీబీఎఫ్‌సీ సలహా ప్యానల్ సభ్యురాలిగా సునీత

ఎర్రగడ్డ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్‌కు చెందిన బీజేపీ మహిళా మోర్చా నగర ఉపాధ్యక్షురాలిగా ఉన్న సుర సునీతను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్(సీబీఎఫ్‌సీ) హైదరాబాద్ రీజియన్ సలహా ప్యానల్ సభ్యురాలిగా నియమించారు. ఈ మేరకు సిబీఎఫ్‌సీ హైదరాబాద్ రీజియన్ ఆఫీసర్ షిఫాలి కుమార్ నియామకపత్రం అందించారు. బీజేపీ నాయకులు డి.ప్రేమ్‌కుమార్, ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షులు ఈదులకంటి రాజేష్, నాయకులు గణష్, బోట్టు విజయ్‌కుమార్ తదితరులు సునీత నివాసానికి వెళ్లి అభినందించారు.


నోడల్ అధికారి దివ్యకు వినపత్రం అందజేస్తున్న యాదయ్యగౌడ్, రాంపాక నాగయ్య

సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రజావాణిలో వినతి

బేగంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేలా కృషి చేయాలని కోరుతూ మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌కు సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య వినతిపత్రం ఇచ్చారు. ఇప్పటికే ప్రజావాణిలో నాలుగుసార్లు వినతిపత్రం ఇచ్చినట్టు తెలిపారు. ఈ నెల 16న అసెంబ్లీలో పెండింగ్ బిల్లులపై చర్చించాలని, బకాయి నిధులను మంజూరు చేసి మాజీ సర్పంచులను ఆత్మహత్యల నుంచి కాపాడాలన్నారు. కాగా శుక్రవారం ప్రజావాణికి 441 దరఖాస్తులు వచ్చాయి. ప్రధానంగా ఇళ్లు, పెన్షన్ల కోసం మహిళలు దరఖాస్తులను అధికారులకు అందజేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు 110, మైనార్టీ సంక్షేమ శాఖకు 76, రెవెన్యూకు 71, విద్యుత్ శాఖకు 57, హోంశాఖకు చెందిన 23, ఇతర శాఖలకు సంబంధించి 104 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుని వారి సమస్యలు తెలుసుకున్నారు.

కూరగాయల కోసం వెళ్లిన ఇద్దరు బాలురు అదృశ్యం


రోషన్ (ఫైల్)


లట్టు (ఫైల్)

బోరబండ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూరగాయాలు తీసుకొచ్చేందుకు మార్కెట్‌కి వెళ్లిన ఇద్దరు బాలురు అదృశ్యమైన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ లంబగుండుకు చెందిన రోషన్ (12), లట్టు(10)లను గురువారం లట్టు తల్లి జాహెద కూరగాయల కోసం రూ.500 మార్కెట్‌కి పంపించింది. అయితే వాళ్లు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో లట్టు తల్లి జాహెద బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు. సీసీ ఫుటేజీ పరిశీలించగా బోరబండ బస్‌సాప్‌లో కూకట్‌పల్లి బస్ ఎక్కినట్లు గుర్తించారు.

తిరుమల నడకదారిలో భక్తుడు మృతి

- మృతుడు హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి


మృతిచెందడానికి ముందు అలిపిరి వద్ద రవికుమార్

తిరుమల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో సరదాగా మాట్లాడుతూ ఉల్లాసంగా అలిపిరి మెట్లెక్కుతున్న ఓ యువకుడు హఠాత్తుగా కుప్పకూలిపోయాడు. గుండె పట్టుకుని పడిపోయిన మిత్రుడికి ఏమైందో తెలియక పైకి లేపేందుకు ప్రయత్నించారు తోటి స్నేహితులు. పక్కన భక్తులు, సమీపంలోని సిబ్బందితో కలిసి వెంటనే తిరుమలలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు చెప్పారు. మరికొన్ని గంటల్లో స్వామిని దర్శించుకుంటామనుకుంటే ఇలా జరిగిందంటూ స్నేహితులు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని అమీర్‌పేట్‌కు చెందిన సీహెచ్.రవికుమార్(38) ఐదుగురు స్నేహితులతో కలిసి శుక్రవారం ఉదయం తిరుపతికి చేరుకున్నాడు. దర్శనానికి సమయం ఉండటంతో శ్రీకాళహస్తి వెళ్లి తిరిగి మధ్యాహ్నం తిరుపతి చేరుకున్నారు. మొక్కులో భాగంగా అలిపిరి నుంచి తిరుమలకు నడక ప్రారంభించారు. స్నేహితులతో మాట్లాడుకుంటూ 2,500వ మెట్టు వరకు చేరుకున్నారు. అప్పటివరకు సరదాగా కనిపించిన రవికుమార్ ఒక్కసారిగా ఛాతినొప్పి అంటూ కుప్పకూలిపోయాడు. పైకి లేపేందుకు ప్రయత్నించినా స్పందించకపోవడంతో అంబులెన్స్‌లో తిరుమలలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. రవికుమార్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు రవికుమార్ సోదరుడికి సమాచారమిచ్చారు.

మానవ మేథస్సుతో పోల్చితే 'ఏఐ' పరిమితం

- గ్లోబల్‌గ్యాన్ వ్యవస్థాపకులు శ్రీనివాస్ అద్దేపల్లి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మానవ మేథస్సుతో పోలిస్తే కృత్రిమ మేథస్సు (ఏఐ) పరిధి పరిమితమని గ్లోబల్ గ్యాన్ లీడర్‌షిప్ వ్యవస్థాపకులు శ్రీనివాస్ అద్దేపల్లి అన్నారు. మానవ మేథస్సు 2.0 ఏఐ యుగంలో నాయకత్వం కోసం అదనపు నైపుణ్యాలు అనే అంశంపై ఆన్‌లైన్‌లో జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవ సామర్థ్యం మెరుగుపరుచుకోవడానికి ఏఐపై ఆధారపడాల్సిన అవసరం ఉందన్న ఆయన ఆవిష్కరణ, నిర్ణయాలను తీసుకోవడంలో ప్రొఫెషనల్స్‌కు సహాయపడవచ్చన్నారు. ఈ సమావేశంలోనే ఏఐ ఫర్ బిజినెస్ లీడర్స్ కార్యక్రమాన్ని ఆవిష్కరించారు.


జలమండలి కాంగార్ యూనియన్ అధ్యక్ష అభ్యర్థి రాజిరెడ్డికి మద్దతు ప్రకటిస్తున్న జలమండలి ఉద్యోగులు

బీఆర్ఎస్ ప్రభుత్వంలో నష్టపోయిన కార్మికులు

- ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

అమీర్‌పేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ కాంగార్ యూనియన్‌ను గెలిపిస్తే కార్మికులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ చంద్రశేఖర్ అన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గత ప్రభుత్వంలో జలమండలి కార్మికులు తీవ్రంగా నష్టపోయారని వెల్లడించారు. ఎస్ఆర్‌నగర్‌లోని జలమండలి కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగార్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కంగార్ యూనియన్ అధ్యక్ష అభ్యర్థి మొగుళ్ల రాజిరెడ్డి అధ్యక్షత వహించగా చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఐఎన్‌టీయూసీ అనుబంధ కార్మిక సంఘం అని, కాంగ్రెస్ అధికారంలో ఉన్న నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, యూనియన్ నాయకులు భూమయ్య, రామరాజు, రమణారెడ్డి, ప్రసాద్, గణేష్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

- ప్రభుత్వానికి ఎస్‌టీయూ నేతల విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇష్తేకరుద్దీన్, రామసుబ్బారావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న ఉద్యోగులకు సంఘం తరపున సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమమ్ స్కేల్ వర్తింపజేయాలని, సర్వీస్ నిబంధనలు, ఇన్సూరెన్స్‌తో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి షుకక్, ఇసాక్‌అహ్మద్, రషీద్, ఆశీర్వాదం పాల్గొన్నారు.


సమ్మె చేస్తున్న ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న ఎస్‌టీయూ నేతలు

పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగాన్ని గుర్తుచేసుకోవాలి


సమావేశంలో పాల్గొన్న కిరాక్ ఆర్పీ, పొట్టి శ్రీరాములు మనుమరాళ్లు అనురాధ, ప్రొ. రేవతి

పంజాగుట్ట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారు పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగాన్ని స్మరించుకోవాలని, ఆయన తెలుగు వారి కోసం ప్రాణత్యాగం చేశారని జబర్దస్త్ కిరాక్ ఆర్పీ అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పొట్టి శ్రీరాములు మనుమరాళ్లు అనురాధ, ప్రొఫెసర్ రేవతిలతో కలిసి ఆయన మాట్లాడారు. పొట్టి శ్రీరాములు తెలుగువారి ఆత్మగౌరవం కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి ప్రాణత్యాగం చేశారన్నారు. శ్రీరాములు అక్క కుమారుడు ఎన్.ఆర్.గుప్తా చివరి వరకు ఆయన వెనుకే ఉన్నారన్నారు. ఆయన కుమార్తె ప్రొఫెసర్ రేవతి, అనురాధ మాట్లాడుతూ.. డిసెంబరు 15న ఏపీ ప్రభుత్వం ఆయన ఆత్మార్పణ దినంగా ప్రకటించిందన్నారు.

అత్తింటి వేధింపులతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య

రాయదుర్గం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్తల వేధింపులు తాళలేని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా చిత్తాపూర్ గ్రామానికి చెందిన మొక్కపాటి శ్రీనివాసరావు పెద్ద కుమార్తె వెంకట నాగలక్ష్మి (28) మియాపూర్ మాతృశ్రీనగర్‌లో ఉంటూ ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తోంది. నాగలక్ష్మికి 2018లో వివాహం చేయగా ఓ పాప పట్టింది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో 2019లో విడాకులు తీసుకున్నారు. దీంతో తల్లిదండ్రులు నాగలక్ష్మికి నగరంలో ఉంటున్న ఏలూరుకు చెందిన సివిల్ కాంట్రాక్టర్ మనోజ్‌కు ఇచ్చి ఈ ఏడాది ఆగస్టు 22న రెండో వివాహం జరిపించారు. పెళ్లైన నాటి నుంచి నాగలక్ష్మిని మనోజ్ వేధిస్తున్నాడు. అతడికి మనోజ్ తల్లి సహకరించేది. నాగలక్ష్మికి తల్లిదండ్రులు గతంలో తమ స్వగ్రామంలో 1.5 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. ఆ భూమిని తన పేరు మీద రాయాలని, ఆ భూమిపై వచ్చే ఆదాయం తనకే ఇవ్వాలని నాగలక్ష్మిని భర్త వేధించేవాడు. ఎలాంటి పని చేయకుండా ఇంటి వద్దే ఉండే అతను భార్యను వేధించడమే పనిగా పెట్టుకున్నాడు. అంతేకాకుండా నాగలక్ష్మికి మొదటి భర్త ద్వారా పుట్టిన పాపను హాస్టల్‌లో వేస్తానని బెదిరించేవాడు. భర్త తనను వేధిస్తున్న తీరును నాగలక్ష్మి తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పేది. తల్లిదండ్రులను వచ్చి తన సమస్యను పరిష్కరించాలని కోరేది. ఈ క్రమంలో కొద్ది రోజులుగా మనోజ్ భార్యను విపరీతంగా కొడుతున్నాడు. ఇదిలా ఉండగా.. నాగలక్ష్మి విషం తాగిందని, ఆస్పత్రిలో చేర్చామని మనోజ్ ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. ఆస్పత్రిలో చేరిన నాగలక్ష్మి చికిత్స పొందుతూ గురువారం రాత్రి చనిపోయింది. తన కుమార్తె మృతికి ఆమె భర్త మనోజ్, అత్త లక్ష్మిల వేధింపులే కారణమని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మియాపూర్ పోలీసులు తెలిపారు.

అనాథాశ్రమం నుంచి యువతి అదృశ్యం

బోయిన్‌పల్లి, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): అనాథాశ్రమం నుంచి యువతి అదృశ్యమైన ఘటన ఓల్డ్ బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా చోడవరానికి చెందిన పూసలపాటి హేమలత (18)కు వినికిడి లోపం ఉంది. కొన్ని రోజుల క్రితం తప్పిపోయి వచ్చిన ఆమె బోయిన్‌పల్లి పోలీసులకు చిక్కింది. దీంతో తలిదండ్రులకు అప్పగించారు. ఈ క్రమంలో ఆమెను తల్లిదండ్రులు ఓల్డ్ బోయిన్‌పల్లిలోని లోటస్ అనాథాశ్రమంలో చేర్పించారు. అయితే శుక్రవారం ఆమె అనాథాశ్రమం నుంచి వెళ్లిపోయింది. దీంతో నిర్వాహకులు బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు సెక్టార్ ఎస్ఐ నాగేంద్రబాబు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.


పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే

అంధుల జీవితాల్లో దేవనార్ వెలుగులు

- కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే

బేగంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎలా అయితే దళితుల జీవితాల్లో వెలుగులు నింపారో.. దేవనార్ అంధుల పాఠశాల ద్వారా సాయిబాబాగౌడ్ అంధుల జీవితంలో వెలుగులు నింపడం సంతోషంగా ఉందని కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే అన్నారు. బేగంపేటలోని దేవనార్ అంధుల పాఠశాల ప్రాంగణంలో నిర్మించిన నూతన భవనాన్ని కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. దేవనార్ పాఠశాలకు అవసరమైన సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



రహ్మత్‌నగర్ డివిజన్‌లో సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ విక్రమ్‌తో కలిసి కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పౌరసరఫరాల దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి రిజిస్టర్‌లను పరిశీలించారు.

\- యూసుఫ్‌గూడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి)



ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ వ్యవస్థాపకులు డీవీఎస్ రాజు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కల్చరల్ సెంటర్ చైర్మన్ కేఎస్ రామారావు, ఫిల్మ్‌నగర్ సొసైటీ సెక్రటరీ, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ నివాళులర్పించారు.

\- బంజారాహిల్స్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి)


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం వెస్ట్ మారేడుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముషీరాబాద్ మండల పరిధిలోని పద్మారావు నగర్, భోలక్ పూర్ ప్రాంతాలకు చెందిన 11 మంది కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకాల కింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద మధ్య తరగతి కుటుంబాలలో ఆడపిల్ల పెండ్లి ఆర్థికంగా ఎంతో భారంతో కూడుకున్నదని, ఈ సాయం వారికి కొంత వెసులుబాటుగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, ఆర్ఐ శివ ప్రసాద్, రాము, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

ఇందిరానగర్‌కాలనీలో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్‌కాలనీ రోడ్డునెంబర్-1లో శుక్రవారం స్థానిక కార్పొరేటర్ సామల హేమ పర్యటించారు. రోడ్డునెంబర్1 నుండి 5వరకు జరుగుతున్న స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. సుమారు రూ.70లక్షల వ్యయంతో ఈ పనులు మొదలు పెట్టామని త్వరగా పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానికంగా ఉన్న సమస్యలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్రాహ్మణబస్తీలో జరుగుతున్న వాటర్‌లైన్ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, ఆర్‌వీ రమణ పాల్గొన్నారు.


మర్రి రాఘవయ్యకి గుర్తింపు పత్రాన్ని అందజేస్తున్న జనరల్ మేనేజర్ జైన్

ఎంప్లాయీస్ సంఘ్‌కి గుర్తింపు పత్రం

చిలకలగూడ, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘ్ ఎన్నికల్లో 43 శాతం ఓట్లు సాధించి, గుర్తింపు పొందిన ద.మ.రైల్వే ఎంప్లాయీస్ సంఘ్‌కి జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ గుర్తింపు పత్రాన్ని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రైల్వేమెన్, ద.మ.రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్యకి శుక్రవారం రైల్ నిలయంలో అందజేశారు. కార్యక్రమంలో సంఘ్ సంయుక్త కార్యదర్శి భరణీ భానుప్రసాద్, సహాయ కార్యదర్శి రుద్రారెడ్డి, మీడియా ప్రతినిధి షేక్ రవూఫ్, కె.వి.ఆర్. ప్రసాద్, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.


బ్రాహ్మణబస్తీలో నిర్వహించిన ఉచిత కంటివైద్యశిబిరంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్

బ్రాహ్మణబస్తీలో ఉచిత కంటివైద్యశిబిరం

బౌద్ధనగర్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం వారాసిగూడ బ్రాహ్మణబస్తీలో ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఉచిత కంటివైద్యశిబిరాన్ని ప్రారంభించారు. పలువురు ఈ వైద్యశిబిరంలో పాల్గొని కంటిపరీక్షలు నిర్వహించుకున్నారు. మళ్లీ 18వ తేదీన ఉచిత కంటివైద్యశిబిరంను నిర్వహిస్తున్నామని శిబిరం ఏర్పాటుచేసే ప్రాంతాన్ని త్వరలో తెలుపుతామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ యశ్వంత్, సిబ్బంది గణేశ్, సునీల్, శ్రీనివాస్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి, నాయకులు త్రివేణీ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న యూసీసీ ప్రతినిధులు

18న యునైటెడ్ క్రిస్టమస్ సెలబ్రేషన్స్

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ క్రిస్టమస్ సెలబ్రేషన్స్ కమిటీ, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ సంయుక్త ఆధ్వర్యంలో 18న 46వ గ్రేటర్ హైదరాబాద్ క్రిస్మస్ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ ఛైర్‌పర్సన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీడీ అరుణ తెలిపారు. శుక్రవారం సెయింట్ మేరీస్ చర్చ్ ఆవరణలో కమిటీ ప్రధాన కార్యదర్శి స్టీవా గెలెలీ, కో ఛైర్మన్ ఏసు దాస్, వైస్ ఛైర్మన్ రాబర్ట్ సూర్యప్రకాశ్ కలిసి మాట్లాడారు. వెస్లీ పీజీ కాలేజీ మైదానంలో వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో పాటు మంత్రులు, కార్డినల్ ఆంథోని, సీఎస్ఐ డిప్యూటీ మాడరేటర్ రూబెన్ మార్క్, బిషప్ డేనియల్, పాస్టర్ పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.


సికింద్రాబాద్ ఎస్‌డీ రోడ్డులో గజవాడ శివనారాయణ, ముచ్చర్ల కృష్ణ, రాగిల్లి ఆనంద్ బాబు గౌడ్, మనసాని వినయ్‌లు ప్రతి ఏటా 600కు పైగా అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం చేస్తున్నారు. ఈ పడిపూజ కార్యక్రమంలో శుక్రవారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు అతెల్లి శ్రీనివాస్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- (రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి)

ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడో?

● తవ్వి రెండేళ్లయినా పట్టించుకోని అధికారులు
● ఇళ్లల్లో దుమ్ము, ధూళి.. ప్రమాదాల బారిన పడుతున్న పిల్లలు
● ఎమ్మెల్యే, కార్పొరేటర్‌పై స్థానికుల ఆగ్రహం


వారాసిగూడలో పోచమ్మ దేవాలయం వీధిలో తవ్వినరోడ్డు

బౌద్ధనగర్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్ వారాసిగూడ పోచమ్మ ఆలయం వీధిలో రెండు సంవత్సరాల క్రితం తవ్విన రోడ్డుకు ఇంకా మోక్షం కలగలేదు. ఇసుక తేలిన రోడ్డు, గుంతలుపడిన గతుకుల రోడ్డుపైనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో రెండేళ్లనుండి ఆ వీధిలో ప్రజలంతా ఎన్నో అవస్థలు పడుతున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని వారాసిగూడ పోచమ్మ దేవాలయం వీధిలో అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందు సీవరేజీ పైపులైన్, మంచినీటి పైపులైన్ మరమ్మతుల నిమిత్తం రోడ్డును తవ్వారు. ఇప్పటికీ ఎటువంటి నూతన రోడ్డు నిర్మాణం చేపట్టకపోవటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ, జలమండలి విభాగాల అధికారుల సమన్వయంతో పాటు సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావు గౌడ్, కార్పొరేటర్ కంది శైలజ నిర్లక్ష్యం వల్లనే రోడ్డు నిర్మాణపనులు చేపట్టడం లేదని స్థానిక మహిళలు, వృద్ధులు మండిపడుతున్నారు. పోచమ్మ ఆలయ వీధిలో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణానికి ముందుకు రాకపోవటంతో ఆ నిధులు క్యాన్సల్ అయ్యాయి. స్థానికులు పలుమార్లు ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ దృష్టికి తీసుకువెళితే మళ్లీ ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరయ్యాయని కాకమ్మ కబుర్లు చెబుతుండటంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి వర్షం కురిస్తేనే తవ్వినరోడ్లపై గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోతుందని, దీంతో వాహనదారులు, పాదచారులు, పిల్లలు, వృద్ధులు ప్రమాదాల భారిన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు.

ఎమ్మెల్యే, కార్పొరేటర్ నిర్లక్ష్యమే

బౌద్ధనగర్ డివిజన్లో పలుచోట్ల నిర్మించిన సిమెంట్‌రోడ్లను తవ్వి మరల నూతన రోడ్లు వేస్తున్నారని రెండేళ్ల క్రితం తవ్విన బీటీ రోడ్డు స్థానంలో నూతన రోడ్డు నిర్మాణంపై సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కార్పొరేటర్ కందిశైలజ పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీతాఫల్‌మండిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తవ్విన రోడ్డుతో అవస్థలు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యేను కలిసి విజ్ఞప్తి చేసినా లాభం లేకుండా పోయింది. సమస్యలపై స్పందించాల్సిన కార్పొరేటర్ సమస్యలను గాలికి వదిలేశారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తవ్వినరోడ్డుపై వెళ్లలేకపోతున్నాం



వారాసిగూడ పోచమ్మ దేవాలయం వీధిలో రెండేళ్ల క్రితం రోడ్డును తవ్వి నిర్లక్ష్యంగా వదిలేశారు. తవ్వినరోడ్డుపై నిత్యం దుమ్మురేచి ఇబ్బందులు పడుతున్నాం. ద్విచక్ర వాహనాల మీద వెళ్లేటప్పుడు స్కిడ్ అయి కిందపడుతున్నాం. వర్షం పడితే రోడ్డు మీదకు వెళ్లే పరిస్థితి లేదు.

స్వాతి, వారాసిగూడ

దుమ్ము, ధూళి భరించలేకపోతున్నాం:



తవ్విన రోడ్డుపై ధూళి, దుమ్ము నిత్యం ఇళ్లలోకి వస్తుంది. వారాసిగూడ పోచమ్మ ఆలయ వీధి నుండి పార్శీగుట్ట వరకు నిత్యం ఎంతోమంది రాకపోకలు సాగిస్తుంటారు. రెండు సంవత్సరాల క్రితం తవ్వినరోడ్డుతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుపై వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

ధీకొండ రాజ్‌కుమార్, వారాసిగూడ

సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రజావాణిలో వినతి



నోడల్ అధికారి దివ్యకు వినపత్రం అందజేస్తున్న యాదయ్యగౌడ్, రాంపాక నాగయ్య

బేగంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేలా కృషిచేయాలని కోరుతూ ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌కు సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య వినతి పత్రం ఇచ్చారు. ఇప్పటికే నాలుగు సార్లు వినతిపత్రం ఇచ్చినట్టు తెలిపారు. ఈనెల 16న అసెంబ్లీలో పెండింగ్ బిల్లులపై చర్చించాలని, బకాయి నిధులను మంజూరుచేసి మాజీ సర్పంచులను ఆత్మహత్యలనుంచి కాపాడాలన్నారు. నిధులు విడుదల చేసేలా కృషి చేయాలని మాజీ సర్పంచులు కోరారు. కాగా శుక్రవారం ప్రజావాణికి 441 దరఖాస్తులు వచ్చాయి. ప్రధానంగా ఇళ్లు, పెన్షన్ల కోసం మహిళలు దరఖాస్తులను అధికారులకు అందజేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు 110, మైనార్టీ సంక్షేమ శాఖకు 76, రెవెన్యూకు 71, విద్యుత్ శాఖకు 57, హోంశాఖకు చెందిన 23, ఇతర శాఖలకు సంబంధించి 104 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుని వారి సమస్యలు తెలుసుకున్నారు.

తిరుమల నడకదారిలో భక్తుడు మృతి

● మృతుడు హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి


మృతిచెందడానికి ముందు అలిపిరి వద్ద రవికుమార్

తిరుమల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో సరదాగా మాట్లాడుతూ ఉల్లాసంగా అలిపిరి మెట్లెక్కుతున్న ఓ యువకుడు హఠాత్తుగా కుప్పకూలిపోయాడు. గుండె పట్టుకుని పడిపోయిన మిత్రుడికి ఏమైందో తెలియక పైకి లేపేందుకు ప్రయత్నించారు తోటి స్నేహితులు. పక్కన భక్తులు, సమీపంలోని సిబ్బందితో కలిసి వెంటనే తిరుమలలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు చెప్పారు. మరికొన్ని గంటల్లో స్వామిని దర్శించుకుంటామనుకుంటే ఇలా జరిగిందంటూ స్నేహితులు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని అమీర్‌పేట్‌కు చెందిన సీహెచ్.రవికుమార్(38) ఐదుగురు స్నేహితులతో కలిసి శుక్రవారం ఉదయం తిరుపతికి చేరుకున్నాడు. దర్శనానికి సమయం ఉండటంతో శ్రీకాళహస్తి వెళ్లి తిరిగి మధ్యాహ్నం తిరుపతి చేరుకున్నారు. మొక్కులో భాగంగా అలిపిరి నుంచి తిరుమలకు నడక ప్రారంభించారు. స్నేహితులతో మాట్లాడుకుంటూ 2,500వ మెట్టు వరకు చేరుకున్నారు. అప్పటివరకు సరదాగా కనిపించిన రవికుమార్ ఒక్కసారిగా ఛాతినొప్పి అంటూ కుప్పకూలిపోయాడు. పైకి లేపేందుకు ప్రయత్నించినా స్పందించకపోవడంతో అంబులెన్స్‌లో తిరుమలలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. రవికుమార్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు రవికుమార్ సోదరుడికి సమాచారమిచ్చారు.

మానవమేధస్సుతో పోలిస్తే ఏఐ పరిధి పరిమితం

● గ్లోబల్‌గ్యాన్ వ్యవస్థాపకులు శ్రీనివాస్ అద్దేపల్లి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మానవ మేధస్సుతో పోలిస్తే కృత్రిమ మేధస్సు (ఏఐ) పరిధి పరిమితమని గ్లోబల్ గ్యాన్ లీడర్‌షిప్ వ్యవస్థాపకులు శ్రీనివాస్ అద్దేపల్లి అన్నారు. మానవ మేధస్సు 2.0 ఏఐ యుగంలో నాయకత్వం కోసం అదనపు నైపుణ్యాలు అనే అంశంపై ఆన్‌లైన్‌లో జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవ సామర్థ్యం మెరుగుపరుచుకోవడానికి ఏఐపై ఆధారపడాల్సిన అవసరం ఉందన్న ఆయన ఆవిష్కరణ, నిర్ణయాలను తీసుకోవడంలో ప్రొఫెషనల్స్‌కు సహాయపడవచ్చన్నారు. ఈ సమావేశంలోనే ఏఐ ఫర్ బిజినెస్ లీడర్స్ కార్యక్రమాన్ని ఆవిష్కరించారు.


పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే

అంధుల జీవితాల్లో దేవనార్ వెలుగులు

● కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే

బేగంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎలా అయితే దళితుల జీవితాల్లో వెలుగులు నింపారో.. దేవనార్ అంధుల పాఠశాల ద్వారా సాయిబాబాగౌడ్ అంధుల జీవితంలో వెలుగులు నింపడం సంతోషంగా ఉందని కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే అన్నారు. బేగంపేటలోని దేవనార్ అంధుల పాఠశాల ప్రాంగణంలో నిర్మించిన నూతన భవనాన్ని కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. దేవనార్ పాఠశాలకు సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

నేడు శ్రీదత్తజయంతి మహోత్సవాలు

మారేడుపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 14న శ్రీదత్త జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ పాలక మండలి చైర్మన్ రేపాల వెంకటేశ్వర్లు తెలిపారు.

లక్ష్యంతో ఉన్నత శిఖరాలు చేరుకోవాలి: సుధీర్‌బాబు



బహుమతులను అందజేస్తున్న డీపీఓ సుధీర్‌బాబు,పిరమిడ్ ఆకారంగా ఏర్పడిన విద్యార్థులు

చిలకలగూడ, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లోనూ రాణించాలని డిప్యూటీ పర్సనల్ ఆఫీసర్ సుధీర్ బాబు అన్నారు. సికింద్రాబాద్, రైల్ నిలయం ఆర్ఆర్‌సీ గ్రౌండ్స్‌లో రైల్వే జూనియర్ కాలేజీ 55వ క్రీడా వార్షికోత్సవాన్ని రెండు రోజులపాటు వివిధ పోటీలు నిర్వహించి శుక్రవారం విజేతలకి బహుమతులను అందజేశారు. విద్యార్థులు పిరమిడ్‌గా ఏర్పడటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సోమేందర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వెంకటరమణ, లెక్చరర్లు సంజీవ రావు, జ్యోతి, సునీత,సంజీవ రావు, రోజా తదితరులు పాల్గొన్నారు.


వరల్డ్ విజన్ రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న మహిళలు

ప్రాంతాల అభివృద్ధి కోసం మహిళల పాత్ర ఎంతో అవసరం

● వరల్డ్ విజన్ ఇండియా మేనేజర్ పీవీ కృష్ణ

అడ్డగుట్ట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వరల్డ్ విజన్ ఇండియా సంస్థ ద్వారా ప్రాంతాల అభివృద్ధి కోసం మహిళల పాత్ర ఎంతో అవసరమని వరల్డ్ విజన్ ఇండియా మేనేజర్ పీవీ కృష్ణ అన్నారు. శుక్రవారం అడ్డగుట్టలోని తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న బాబు జగ్జీవన్‌రాం కమ్యూనిటీహాలులో నిర్వహించిన వరల్డ్ విజన్ ఇండియా రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చే ఏడాది ఏప్రిల్‌లో కొత్త ప్రాజెక్ట్ ద్వారా బస్తీలో సైతం పర్యటించి ప్రధాన సమస్యలు? విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు, ఆర్థిక పరమైన ఇబ్బందులు, ఏ వర్గం వారు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారు. బస్తీలో ఉండే ప్రధాన సమస్యల్ని గుర్తించేందుకు మహిళా గ్రూపులుగా ఏర్పాటు చేస్తామన్నారు. పిల్లల చదువు, ప్రభుత్వ పాఠశాలలో డ్రాప్ ఔట్ పిల్లల్ని చేర్పించడం ఇలాంటి మంచి ఆలోచనలపై తమ సంస్థ నుంచి సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ కో-ఆర్డినేటర్ జ్యోతి, విజయ్, సమీర్, వలంటీర్ బాలమణి, రుద్రవీణ మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు శోభ, మాల సంక్షేమ సంఘం ప్రతినిధి రమాదేవితో పాటు లంబాడాబస్తీ, అడ్డగుట్టకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

యూనివర్సిటీ బోర్డుల ద్వారా నియామకాలు చేపట్టాలి: నాగరాజు గౌడ్

తార్నాక, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాలకు ఉన్న స్వయం ప్రతిపత్తిని దృష్టిలో ఉంచుకుని వాటిలో యూనివర్సిటీ బోర్డు ద్వారా నియామకాలు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బైరు నాగరాజు గౌడ్ కోరారు. శుక్రవారం ఆయన ఓయూలో విలేకరులతో మాట్లాడుతూ, విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న వివిధ ప్రొఫెసర్ల పోస్టులను ప్రత్యేక కమిషన్ ద్వారా భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, అయితే, ప్రత్యేక కమిషన్ బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండటంతో నియామక ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. గత కొన్నేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా వర్సిటీల్లో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వర్సిటీల బోర్డు ద్వారా పరీక్షలు నిర్వహించి మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీలకు అనుమతి ఇవ్వాలని నాగరాజు గౌడ్ కోరారు.

అత్తింటి వేధింపులు తాళలేక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య

రాయదుర్గం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్తల వేధింపులు తాళలేని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా చిత్తాపూర్ గ్రామానికి చెందిన మొక్కపాటి శ్రీనివాసరావు పెద్ద కుమార్తె వెంకట నాగలక్ష్మి (28) మియాపూర్ మాతృ శ్రీనగర్‌లో ఉంటూ ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తోంది. నాగలక్ష్మికి 2018లో వివాహం చేయగా, ఓ పాప పట్టింది. భారాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో 2019లో విడాకులు తీసుకున్నారు. దీంతో తల్లిదండ్రులు నాగలక్ష్మికి నగరంలో ఉంటున్న ఏలూరుకు చెందిన సివిల్ కాంట్రాక్టర్ మనోజ్‌కు ఇచ్చి ఈ ఏడాది ఆగస్టు 22న రెండో వివాహం జరిపించారు. పెళ్లైన నాటి నుంచి నాగలక్ష్మిని మనోజ్ కొడుతూ, దుర్భాషలాడుతూ వేధిస్తున్నాడు. అతడికి మనోజ్ తల్లి సహకరించేది. నాగలక్ష్మికి తల్లిదండ్రులు గతంలో తమ స్వగ్రామంలో 1.5 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. ఆ భూమిని తన పేరు మీద రాయాలని, ఆ భూమిపై వచ్చే ఆదాయం తనకే ఇవ్వాలని నాగలక్ష్మిని భర్త వేధించేవాడు. ఎలాంటి పని చేయకుండా ఇంటి వద్దే ఉండే అతను భార్యను వేధించడమే పనిగా పెట్టుకున్నాడు. అంతేకాకుండా నాగలక్ష్మికి మొదటి భర్త ద్వారా పుట్టిన పాపను హాస్టల్‌లో వేస్తానని బెదిరించేవాడు. భర్త తనను వేధిస్తున్న తీరును నాగలక్ష్మి తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పేది. తల్లిదండ్రులను వచ్చి తన సమస్యను పరిష్కరించాలని కోరేది. ఇదే క్రమంలో కొద్ది రోజులుగా మనోజ్ భార్యను విపరీతంగా కొడుతున్నాడు. ఇదిలా ఉండగా.. నాగలక్ష్మి విషం తాగిందని, ఆస్పత్రిలో చేర్చామని మనోజ్ ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. ఆస్పత్రిలో చేరిన నాగలక్ష్మి చికిత్స పొందుతూ గురువారం రాత్రి చనిపోయింది. తన కుమార్తె మృతికి ఆమె భర్త మనోజ్, అత్త లక్ష్మిల వేధింపులే కారణమని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మియాపూర్ పోలీసులు తెలిపారు.

అనాథాశ్రమం నుంచి యువతి అదృశ్యం


హేమలత

బోయిన్‌పల్లి,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): అనాథాశ్రమం నుంచి యువతి అదృశ్యమైన సంఘటన ఓల్డ్ బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా చోడవరంకు చెందిన పూసలపాటి హేమలత (18)కి వినికిడి లోపం ఉంది. కొన్నిరోజుల క్రితం తప్పిపోయి వచ్చిన ఆమె బోయిన్‌పల్లి పోలీసులకు చిక్కింది. దీంతో తల్లితండ్రులకు అప్పగించారు. ఈ క్రమంలో ఆమెను తల్లితండ్రులు ఓల్డ్ బోయిన్‌పల్లిలోని లోటస్ అనాథాశ్రమంలో చేర్పించారు. అయితే శుక్రవారం ఆమె అనాథాశ్రమం నుండి తప్పిపోయింది. దీంతో నిర్వాహకులు బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు సెక్టార్ ఎస్ఐ నాగేంద్రబాబు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల కోసం వెళ్లిన ఇద్దరు బాలురు అదృశ్యం

బోరబండ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూరగాయాలు తీసుకొచ్చేందుకు మార్కెట్‌కి వెళ్లిన ఇద్దరు బాలురు అదృశ్యమైన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ లంబగుండుకు చెందిన రోషన్ (12), లట్టు(10)లను గురువారం లట్టు తల్లి జాహేద కూరాగాయల కోసం రూ.500 మార్కెట్‌కి పంపించింది. అయితే వాళ్లు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో లట్టు తల్లి జాహేద బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు. సీసీ ఫుటేజీ పరిశీలించగా బోరబండ బస్‌సాప్‌లో కూకట్‌పల్లి బస్ ఎక్కినట్లు గుర్తించారు.


బోర్‌వెల్ పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకుడు ముప్పిడి మధుకర్

నీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ

బోయిన్‌పల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించడానికి ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేక దృష్టి పెట్టారని కంటోన్మెంట్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముప్పిడి మధుకర్ అన్నారు. ఆ దిశగా అవసరం ఉన్నచోట బోర్లను వేయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కంటోన్మెంట్ 6వ వార్డు పరిధిలో ఏడబ్ల్యుహెచ్‌ఓ సెక్టార్-సీలో నీటి సమస్యను పరిష్కరించడానికి బోర్‌ను వేయిస్తున్నారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్, అజయ్ ముదిరాజ్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముప్పిడి మధుకర్ మాట్లాడుతూ, కంటోన్మెంట్ ఉపఎన్నికలో నీటి సమస్య పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని, అప్పట్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ హామీ ఇచ్చి, ఇచ్చినమాట ప్రకారం బోర్‌ను ఎమ్మెల్యే నిధుల నుండి వేయిస్తున్నట్లు తెలిపారు.